# 97. అల్ ఖద్ర్ (ఔన్నత్యం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. ముఖ్యంగా దైవవాణి అవతరణ గురించి ఇందులో చెప్పడం జరిగింది. 'లైలతుల్ ఖద్ర్' (అత్యున్నతమైన రాత్రి) అన్న ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. దివ్యఖుర్ఆన్ అవతరించిన రాత్రి ఎంత ఘనమైనదో ఇందులో చెప్పడం జరిగింది. ఆ ఘనమైన రాత్రి అల్లాహ్‌ను ఆరాధిస్తే వెయ్యి మాసాలపాటు చేసిన ఆరాధనకు సమానమవుతుంది. అంటే 83 సంవత్సరాల 4 నెలల ఆరాధనకు సమానమవుతుంది. ఆ ఘనమైన రాత్రి దైవదూతలు, జిబ్రయీల్(అస) దేవుని అనుమతితో దైవాదేశాలు తీసుకుని అవతరిస్తారు.

## 97. అల్ ఖద్ర్[1] సూరా

## سُورَةُ الْقَدْرِ

అవతరణ :మక్కా ఆయతులు : 5

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖుర్ఆనును) ఘనమైన రాత్రి యందు అవతరింపజేశాము.[2]

إِنَّا أَنزَلْنَاهُ فِي لَيْلَةِ الْقَدْرِ ①

1. ఈ సూరా మక్కాలో అవతరించిందా? లేక మదీనాలో అవతరించిందా? అనే దానిపై ద్వంద్వాభిప్రాయాలున్నాయి. ఈ సూరా పేరు గురించి కూడా భిన్నాభిప్రాయా లున్నాయి. **'ఖద్ర్'** (اَلْقَدْرُ) అంటే విలువైనది, ఘనత గలది అని ఒక అర్థం. అందుచేత దీనిని విలువైన రాత్రి అనీ, ఘనత గల రాత్రి అనీ అంటారు. 'ఖద్ర్' అంటే నిర్ధారించటం, లెక్కించటం అని ఇంకొక అర్థం. ఈ రాత్రిపూట ఒక ఏడాది కాలానికి సంబంధించిన వ్యవహారాలన్నీ సమీక్షించి, నిర్ణయించబడతాయి. అందువల్ల దీనిని మహత్పూర్వకమైన రేయిగా, నిర్ణయాత్మక రాత్రిగా, ఉత్తర్వులను జారీచేసే రాత్రిగా కూడా వ్యవహరిస్తారు. 'ఖద్ర్' అంటే 'ఇరుకైనది' అని వేరొక అర్థం. ఈ రాత్రియందు దివి నుంచి దిగివచ్చిన దైవదూతలతో భువి అంతా కిక్కిరిసి పోతుంది. ఈ కారణంగా దీనిని 'చాలా కిటకిటలాడే రాత్రి'గా కూడా అభివర్ణిస్తారు. ఈ రాత్రి యందు చేసే దైవారాధన మహత్పూర్వకమైనది. ఎంతో పుణ్యప్రదమైనది. అందువల్ల దీనిని మహిమాన్వితమైన రాత్రి అని కూడా అంటారు. ఇంతటి విలువైన ఈ రాత్రి ఇంతకీ ఎప్పుడు? అనే విషయమై భిన్నాభిప్రాయముంది (ఫత్హుల్ ఖదీర్). అయితే హదీసులను, చారిత్రక ఉల్లేఖనాలనుబట్టి ఇది రమజాన్ నెల చివరి దశకంలోని బేసి రాత్రుల్లో ఏదో ఒక రాత్రి నెలకొంటుందని తెలుస్తోంది. ఈ సంగతి అస్పష్టంగా ఉండటంలో కూడా ఒక పరమార్థం ఉన్నది. రమజాన్ చివరిలో – బేసిరాత్రుల్లో ఈ విలువైన రాత్రిని అన్వేషించే ప్రయత్నంలో భక్తులు వీలైనంత ఎక్కువగా దైవారాధన చేసి, పాపాల మన్నింపు కోసం వేడుకోవాలన్నదే దీని పరమార్థం.

2. దేవుడు దివ్య ఖుర్ఆన్ను 'లౌహె మహ్ఫూజ్' నుండి భూమండలానికి సమీపంలోనున్న ఆకాశంపై దింపాడు. అక్కడి నుండి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)పై – అంచెల వారీగా, కొద్దికొద్దిగా – 23 ఏండ్ల కాలంలో పూర్తిగా అవతరింపజేశాడు. **'లైలతుల్ ఖద్ర్'** అనేది రమజాన్ మాసంలోనే వస్తుంది. "దివ్య ఖుర్ఆన్ అవతరించిన నెల రమజాన్ (నెల)" అన్న ఆయతు ఈ సందర్భంగా గమనించదగినది (అల్ బఖర – 185).

**2** ఘనమైన రాత్రి గురించి నువ్వేమను కున్నావు?[3]

وَمَآ أَدْرَىٰكَ مَا لَيْلَةُ ٱلْقَدْرِ ﴿٢﴾

**3** ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా మేలైనది.[4]

لَيْلَةُ ٱلْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ ﴿٣﴾

**4** ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ (జిబ్రయీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల (నిర్వహణ) నిమిత్తం (దివి నుంచి భువికి) దిగివస్తారు.[5]

تَنَزَّلُ ٱلْمَلَٰٓئِكَةُ وَٱلرُّوحُ فِيهَا بِإِذْنِ رَبِّهِم مِّن كُلِّ أَمْرٍ ﴿٤﴾

**5** ఆ రాత్రి ఆసాంతం శాంతియుత మైనది[6] – తెల్లవారే వరకూ (అది ఉంటుంది).

سَلَٰمٌ هِىَ حَتَّىٰ مَطْلَعِ ٱلْفَجْرِ ﴿٥﴾

3. ప్రశ్నార్థకమైన ఈ వాక్యం ద్వారా కూడా ఈ రాత్రికి గల మహత్తు స్పష్టమవుతోంది. మానవమాత్రులెవరూ దీని లోతుల్లోకి పూర్తిగా పోలేరు. ఆ సంపూర్ణ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది.

4. అంటే – ఈ రాత్రి యందు చేసే దైవారాధన వెయ్యి మాసాలలో చేసే ఆరాధనకంటే కూడా గొప్పది. వెయ్యి మాసాలంటే మామూలు విషయమా? 83 సంవత్సరాల 4 నెలలన్న మాట! అతి తక్కువ కాలంలో అత్యంత అధికంగా పుణ్యం సంపాదించుకునేందుకు వీలుగా దేవుడు ముహమ్మద్ (సఅసం) అనుచర సమాజంపై చేసిన మహోపకారం ఇది.

5. ఇక్కడ **'రూహ్'** (ఆత్మ) అంటే జిబ్రయీల్ (అలైహిస్సలాం) అని మరువరాదు. దైవదూత జిబ్రయీల్ తన తోటి దూతలందరితో కలసి భూమండలంపై దిగుతారు. ఆ సంవత్సరం దేవుడు సమ్మతించి ఆమోదించిన విషయాలకు కార్యరూపం ఇచ్చే నిమిత్తం వస్తారు.

6. అంటే – ఆ రాత్రియందు కీడు అన్నదే లేదు. అది పూర్తిగా శాంతితో కూడుకున్నది. ఆ రాత్రి పూట దైవదాసులంతా షైతాన్ కీడు నుంచి సురక్షితంగా ఉంటారు. లేదా దైవదూతలు విశ్వాసులకు 'సలాం' పంపిస్తారు. ఆ రాత్రియందు ఈ దుఆ చేయాలని దైవప్రవక్త (స) గట్టిగా నొక్కి వక్కాణించారు: **"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ"** (తిర్మిజీ – దుఆల ప్రకరణం; ఇబ్ను మాజా – దుఆ ప్రకరణం).
(**అర్థం:** ఓ అల్లాహ్! నిశ్చయంగా నీవు క్షమించేవాడవు. క్షమాభిక్ష పెట్టడమంటే నీకు మహా ఇష్టం. కాబట్టి నన్ను క్షమించు).